# ఏ సిరులెందుకూ.. ఏ సౌఖ్యములెందుకూ...

పెబ్బిలి హైమావతి

"అర్చనా! నీకోసం ఎవరో వచ్చారట, విజిటర్స్ రూంలో వెయిట్ చేస్తున్నారట. పనమ్మాయి చెప్పి వెళ్లిందిప్పుడే!" అంది ప్రతిమ పుస్తకం పక్కన పెట్టి మంచం మీద నుండి లేస్తూ.

"ఈ టైములో విజిటర్స్ ఏమిటే బాబూ!" విసుక్కుంటూ చెప్పులు వేసుకొని విజిటర్స్ రూమ్ వైపు నడిచింది అర్చన.

ఆరోజే ఎమ్‌సెట్ పరీక్ష. కాలేజీ కాంపస్ అంతా కోలాహలంగా ఉంది. ఎవరి ముఖం చూసినా ఆందోళనా, ఆతృతా కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. ఇంచుమించు ప్రతి రెసిడెన్షియల్ కాలేజీలో ఇదే పరిస్థితి. పిల్లల్లో టెన్షన్. లెక్చరర్స్‌లో టెన్షన్. పేరెంట్స్‌లో టెన్షన్!

ఈరోజు నాకోసం మమ్మీగానీ, డాడీగానీ వచ్చి ఉంటారా? అనే ఆలోచన రావడంతో వడివడిగా విజిటర్స్ రూమ్‌లోకి వచ్చిన అర్చనకు ఎదురుగా డ్రైవర్ రాజయ్య కనిపించాడు.

"నువ్వా రాజయ్యా... ఇంకా ఎవరో అనుకున్నాను" అంది అర్చన చిన్నగా నవ్వుతూ.

అర్చనను చూడడంతోనే రాజయ్య లేచి నుంచుంటూ "బాగున్నారా అమ్మా?" అన్నాడు పలకరింపుగా.

"బాగానే ఉన్నాను రాజయ్యా. ఏమిటిలా వచ్చావు?" అంది అర్చన.

"ఇవ్వాళ మీ పరీక్ష అయిపోతుందట కదమ్మా. అమ్మగారు మిమ్మల్ని తీసుకురమ్మని పంపించారు" అన్నాడు రాజయ్య.

ఇంతలో "అర్చనా నీకు ఫోన్!" అంటూ ముందు గదిలో నుండి కేర్‌టేకర్ కేక పెట్టింది. వెంటనే అర్చన వెళ్లి ఫోన్ అందుకుని "హలో!" అంది.

"హలో అర్చనా ఎలా ఉన్నావు? ఎగ్జామ్‌కి బాగా ప్రిపేర్ అయ్యావా? టెన్షన్ పడకుండా కూల్‌గా ఉండు. టైమ్ మేనేజిమెంట్ చేసుకొని జాగ్రత్తగా ఆన్సర్ చెయ్యి పేపర్ని! ఆ.. రాజయ్య వచ్చాడా అక్కడికి. పరీక్ష అయ్యాక సామాన్లు జాగ్రత్తగా పేక్ చేసుకొని వచ్చెయ్యి. బై!" అంటూ ఫోన్ పెట్టేసింది అర్చన తల్లి వందనాదేవి.

ప్రశ్నలు అడగడమే కానీ కూతురు చెప్పే జవాబు వినే ఓపికా తీరికా ఆవిడకు లేవు. ప్రతి నిముషాన్నీ గంటనీ వాల్యుబుల్‌గా ఎంచి కేలుక్యులేట్ చేస్తూ మెకానికల్‌గా ఏది ఏ వేళకు జరగాలో ఆ సమయానికి అది జరిగేటట్లు చూస్తుంది. అందుకే సరిగ్గా రాజయ్య అక్కడికి చేరే టైమ్ అంచనా వేసి కూతుర్ని పలకరిస్తూ ఫోన్ చేసింది వందనాదేవి.

తల్లి మాటల్లో ఏదో ఫార్మాలిటీ ఇంకేదో డ్యూటీ చేస్తున్న భావన తప్ప ఆ మాటల్లో ఆత్మీయతా, లాలిత్యం ఏమీ కనబడలేదు అర్చనకి. అందరి పేరెంట్సూ ఎంతో బాధ్యతగా తమ పిల్లలను దగ్గరుండి పరీక్ష రాయించేందుకు వచ్చారు. తన తల్లిదండ్రులు రాలేదు సరికదా కనీసం ఫోన్‌లోనైనా అభిమానం కనబరచలేనంత బిజీ. తల్లి ఇలా ఫోన్ అయినా చేసింది. తండ్రి అది కూడా లేదు! విరక్తిగా నిట్టూర్చింది.

ఫోన్ పెట్టేసి రాజయ్య ఉన్న గదిలోకి వచ్చి "సరే రాజయ్యా. పరీక్ష రాసి వచ్చాక సామాన్లు పేక్ చేసుకొని వెళదాం. మరి నేను వెళతానూ. ఈలోగా నీకేదైనా పని ఉంటే చూసుకొనిరా" అంది.

"నాకే పనీ లేదమ్మా. అమ్మగారు మిమ్మల్ని పరీక్ష హాలుకి జాగ్రత్తగా తీసుకువెళ్లి తీసుకురమ్మన్నారు. మీరు వచ్చేదాకా నేను ఇక్కడే ఉంటాను" అన్నాడు రాజయ్య.

"సరే అయితే సరిగ్గా మనం పన్నెండున్నరకి బయలుదేరుదాం. ఈలోగా నువ్వు భోజనం చేసి వచ్చెయ్యి!" అంటూ వెళ్లిపోయింది అర్చన అక్కడి నుండి.

అర్చన తల్లిదండ్రులిద్దరూ పేరు మోసిన డాక్టర్సే! తండ్రి భాస్కర్ చైల్డ్ స్పెషలిస్ట్. తల్లి గైనకాలజిస్ట్! కాకినాడలో వాళ్ల ఆసుపత్రికి మంచి పేరుంది. ఎప్పుడూ పేషెంట్స్‌తో కిటకిటలాడుతూ ఉంటుంది. క్షణం తీరిక లేకుండా తల్లిదండ్రులెప్పుడూ బిజీగా ఉంటారు. అందువలన పిల్లల మంచి చెడ్డలూ, అభిరుచులూ తెలుసుకొనే ఓపిక, తీరికా లేకుండా కాలాన్ని డబ్బు కింద మారుస్తూ మేమింత కష్టపడుతున్నది ఎవరికోసం.. మా పిల్ల కోసమేగా! అని సరిపెట్టుకోచూస్తారు.

కొడుకు హేమంత్‌నీ, కూతురు అర్చననీ డాక్టర్లుగా చేసి తమ ప్రాక్టీసుకు వారసులుగా చేయాలని వాళ్ల కోరిక. కానీ హేమంత్ ససేమిరా మెడిసిన్ చదవనని మొండికేసి. ఇంజనీరింగ్ చదివి అమెరికా వెళ్లిపోయాడు ఇండియాలో ఏముంది అంటూ.

మొదటి నుండీ సెంటిమెంట్స్‌కీ ఎటాచ్‌మెంట్స్‌కీ దూరంగానే పెంచారు పిల్లల్ని భాస్కర్, వందన. ఇంట్లో ఉంటే క్రమశిక్షణ అలవడదని చిన్నప్పటినుండీ రెసిడెన్షియల్ స్కూళ్లలోనే చదివించడంతో కన్నతల్లిదండ్రుల పట్ల ఏ అటాచ్‌మెంట్ లేని హేమంత్‌కి, ఇక జన్మభూమి పట్ల ఎందుకుంటుంది ప్రేమ?

హేమంత్ ఉన్నంత కాలం కొంతలో కొంత అయినా తన ఫీలింగ్స్‌ను అన్నగారితో షేర్ చేసుకునేది అర్చన. అతను వెళ్ళిపోవడంతో పూర్తిగా ఒంటరిదయిపోయిన అర్చన తనలో తనే మథనపడుతూ కాలం గడపసాగింది.. రాను రాను ఎవరిమీదో ఎందుకో తెలియని కసి పేరుకోసాగింది అర్చనలో.


నేను చచ్చినా మంచి రేంకు తెచ్చుకోను అనుకుంది కసిగా. ఆ మాట ఇప్పటికి ఎన్నిసార్లో అనుకున్నా తల్లిదండ్రులకు బదులు విజిటర్స్ రూంలో రాజయ్యని చూడడంతోనే గట్టిగానే అనుకుంది అర్చన.

తల్లీ, తండ్రీ.. చివరికి అన్నయ్యా డబ్బు సంపాదన మత్తులోపడి ఎవరికోసమో, ఎందుకోసమో తెలియని ఆరాటంలో పడి కొట్టుకుపోతూ ఏ ఆనందమూ, సంతోషమూ లేకుండా అందరూ ఉండి కూడా ఎవరికి వారు ఒంటరిగా ఎడారి బ్రతుకులు బ్రతకడం ఎంత మాత్రం నచ్చలేదు అర్చనకు.

తనూ అలా డబ్బు సంపాదించే యంత్రంలా మారాలన్న ఊహనే భరించలేకపోతోంది అర్చన. అందుకే ఏది ఏమైనా తాను డాక్టరు కాకూడదన్న నిర్ణయం తీసుకుంది స్థిరంగా. అంతవరకూ పరీక్షకోసం పడిన టెన్షన్ అంతా ఎగిరిపోయింది అర్చనలో.

చిటపటలాడుతూ విజిటర్స్ రూంకి వెళ్లిన అర్చన ఎప్పుడూ లేనంత హుషారుగా నవ్వుతూ రూమ్‌కి రావడం చూసిన ప్రతిమ ఆశ్చర్యంగా స్నేహితురాలి వంక చూస్తూ "మీ డాడీ, మమ్మీ వచ్చారా?" అని అడిగింది. అర్చనని ఎడ్మిట్ చేసినప్పుడు తప్ప మళ్లీ ఎప్పుడూ రాలేదు వాళ్లు. అందుకే అంత ఆశ్చర్యంగా అడిగింది.

"కాదు, మా డ్రైవర్ వచ్చాడు!" అంది అర్చన అదే హుషారుతో. డ్రైవర్ వస్తే అంత హుషారెందుకో అర్థం కాలేదు ప్రతిమకు. ఒక్క క్షణం ఆశ్చర్యంగా స్నేహితురాలివంక చూసి మరేం మాట్లాడకుండా పుస్తకంలోకి చూపు మరల్చింది.



అర్చన పరీక్ష రాసి వచ్చాక అన్నీ సర్దుకొని కారెక్కింది. ప్రయాణం బోరు కొట్టకుండా రాజయ్య దారి పొడు గునా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు. అర్చన అవన్నీ ఉత్సాహంగా వింటూ అది అలా ఎందు కయ్యింది? ఇది ఇంకోలా చేసే బాగుండేది కదా అంటూ తను కూడా మధ్య మధ్యలో సందేహాలు వెలిబు చ్చుతూ మాటల్లో దూరమే తెలియకుండా రాత్రి పద కొండు గంటలకు ఇల్లు చేరుకున్నారు.

లగేజి లోపల పెట్టి రాజయ్య వెళ్లిపోయాడు. వంట మనిషి సావిత్రమ్మ ఎంతో ఆప్యాయంగా అర్చనను కుశల ప్రశ్నలు వేసింది. తాను వచ్చేసరికి తల్లిదండ్రులు ఇంటికి చేరి ఉంటారు అనుకుంది అర్చన. కానీ వాళ్లింకా ఇంటికి రాలేదని సావిత్రమ్మ చెప్పడంతో నిరు త్సాహంగా అనిపించింది అర్చనకు. తల్లిదండ్రులను ఎప్పుడెప్పుడు చూద్దామా అని తనకింత ఆతృతగా ఉంది.. మరి వీళ్లకేం అనిపించదా? అనుకుంది బాధగా.

"అర్చనమ్మా! అన్నం వడ్డించేదా తల్లీ?" అనడిగింది సావిత్రమ్మ.

"వద్దులెండి మామ్మగారూ. మమ్మీ డాడీ వచ్చాక తింటాను. ఈలోగా స్నానం చేసి వస్తాను!" అంటూ మేడమీద ఉన్న తన గదిలోకి వెళ్లింది అర్చన. స్నానం చేసి కిందకు వచ్చేసరికి తల్లీ, తండ్రీ తనకోసమే ఎదురు చూస్తున్నట్లుగా కూర్చుని ఉండడం చూసిన అర్చన ముఖం వెలిగిపోయింది.

"డాడీ!" అంటూ పరుగున వెళ్ళి తండ్రి పక్కన కూర్చుని భుజంమీద తలవాల్చింది.

"బాగున్నావా తల్లీ. ఎగ్జామ్ ఎలా రాశావు?" అన్నాడు భాస్కర్ కూతురి ముంగురులు సవరిస్తూ.

"బాగానే రాశాను డాడీ. అవునూ ఈ రోజు ఇంత లేటయిందేం మమ్మీ?" అంది అర్చన తల్లి వంక చూస్తూ.

"డాడీ నేనూ ఓ డిన్నర్ పార్టీకి ఎటెండ్ అవ్వాల్సి వచ్చింది. అవునూ నువ్వు భోజనం చేశావా?" అనడిగింది వందనాదేవి కూతురి వంక ప్రేమగా చూస్తూ.

"లేదింకా.. మీరు వచ్చాక కలిసి తిందా మని ఆగాను" అంది అర్చన నీరు కారి పోతూ. అన్ని నెలల తర్వాత తాను ఇంటికి వస్తే. తనతో కలిసి భోజనం చెయ్యాలని అని పించలేదా వీళ్లకి అనుకుంది.

అర్చన మాటలు వినడంతోనే "ఇంకా తినలేదా? ఇలా వేళ తప్పి ఆహారం తీసుకో వడం ఆరోగ్యానికి మంచిది కాదని ఎన్నిసార్లు చెప్పాలి నీకు? ఇంకా చిన్న పిల్లలా ఏమిటీ ఎదురుచూడడాలు?"



అన్నాడు భాస్కర్ విసుగ్గా. ప్రేమని కూడా కోపం గానే చూపించగలడు అతను. అంతవరకూ అతని ముఖంలో ఉన్న ప్రసన్నత ఎగిరిపోయింది.

తండ్రి మాటలు వినడంతోనే తప్పు చేసినదానిలా తల వంచుకుంది అర్చన.

"సరే అర్చనా త్వరగా తినేసి నిద్రపో. నాకు చాలా అలసటగా ఉంది. వెళ్ళి పడుకుంటాను. గుడ్‌నైట్!" అంటూ లేచి తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది వందనా దేవి. భాస్కర్ కూడా వేసుకున్న కోటు విప్పి భుజంమీద వేసుకుంటూ "గుడ్‌నైట్ బేబీ!" అంటూ వెళ్ళిపోయాడు.

తనతో కలిసి భోజనం చేయకపోయినా తాను అన్నం తినేదాకా అమ్మ దగ్గర కూర్చుని కబుర్లు చెబితే బాగుండును అనుకున్న అర్చనకు నిరాశే మిగిలింది. తల్లి తండ్రీ వెళ్ళిపోయాక ఒంటరిగా హాల్లో మిగిలిపోయింది అర్చన.

సావిత్రమ్మ తలుపులు మూసి వస్తూ "రామ్మా.. ఛోంచేద్దువు గానీ!" అంది అర్చన దగ్గరకు వచ్చి చేయి పట్టుకుంటూ.

"నాకు ఆకలిగా లేదు. మీరు తినేయండి మామ్మ గారూ!" అంటూ మేడమెట్లవైపు నడిచింది అర్చన.

చప్పున సావిత్రమ్మ అర్చన చెయ్యి పట్టుకుని లాగుతూ "నా తల్లివి కదూ. రాక రాక వచ్చావు. నువ్విలా ఖాళీ కడుపుతో పడుకుంటే నాకు ముద్దెలా దిగుతుందమ్మా? వచ్చి కాస్త ఎంగిలి పడమ్మా!" అంది.

ఆవిడకు అర్చన బాధేమిటో తెలిసినా తీర్చలేని అశక్తురాలు. అందుకే ఇలాంటి సందర్భం ఎదురైనప్పుడు లాలనగా బుజ్జగించి అన్నం తినిపిస్తుంది.

ఈ ఇంట్లో వంట మనిషికి ఉన్నపాటి ఆలోచన తన కన్న తల్లిదండ్రులకు లేదేం అనుకుంది అర్చన. సావిత్రమ్మ లాలనకు అర్చన కంటి వెంట నీళ్లు జలజలా జారిపోయాయి. "మమ్మీ డాడీలతో కలిసి తినాలని ఆశ పడ్డాను. అది కూడా తప్పేనా?" అంది బాధగా.

"తప్పని ఎవరంటారమ్మా. అయినా నీకు తెలియందేమందమ్మా. ఉదయం నుండి అమ్మా, నాన్నా బాగా పనిచేసి అలిసిపోయి వస్తారు. వాళ్లకింక మాట్లాడడానికే ఓపిక ఉండదు. నువ్వే సర్దుకుపోవాలి. ఇలా బాధపడితే ఏమొస్తుంది చెప్పు?" అంటూ తన పమిట చెంగుతో అర్చన చెంపలు తుడిచి డైనింగ్ టేబుల్ వద్దకు తీసుకువెళ్లింది సావిత్రమ్మ.

○○○

అర్చన పరీక్షరాసి వచ్చి నాలుగు రోజులు గడిచిపోయాయి. రొటీన్‌గా వేళకి అన్నీ అమరిపోతూ ఉదయం, రాత్రీ గుడ్ మార్నింగ్, గుడ్‌నైట్‌లాంటి పొడి పొడి పలకరింపులతో దినం మొదలై ముగిసిపోతుంది ఏ మార్పులు లేకుండా.



ఆరోజు హాస్పిటల్‌కు వెళుతూ కూతురితో చెప్పాడు భాస్కర్ "ఈవెనింగ్ మనం ముగ్గురం కలిసి సినిమాకు వెళదా. టిక్కెట్లు తెప్పిస్తాను. మేము వచ్చేసరికి రెడీగా ఉండు" అని.

తండ్రి ప్రపోజల్ వినడంతోనే ఎంతో సంతోషపడిపోయింది అర్చన. ఆరోజు ఉదయం నుండే సాయంత్రం వెళ్లబోయే సినిమాకోసం ఎన్నో ఊహలు అల్లేసుకుంది. అర్చనకు సినిమా చూడాలన్న ఆశకంటే తల్లిదండ్రులతో కొన్ని గంటలు గడపబోతున్నాను అనేదే ఎక్కువ ఆనందాన్ని ఇచ్చింది.

అయితే అనుకున్నట్లుగా భాస్కర్, వందనా ఇంటికి రాలేకపోయారు. పని వత్తిడిలో పడి భాస్కర్ సినిమా ప్రపోజల్ సంగతే మరిచిపోయాడు. అర్చన మాత్రం సాయంత్రం నాలుగు గంటలనుండే తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తూ గేటు దగ్గరే ఉండిపోయింది.

సినిమా టైము అయిపో వస్తూండడంతో తండ్రికి ఫోన్ చేసింది అర్చన. "డాడీ, టైమ్ అయిపోతోంది. ఇంకా ఎప్పుడొస్తారు మీరు?" అంది ఎగ్జైటింగ్‌గా.

పేషెంట్స్‌తో బిజీగా ఉన్న భాస్కర్, తను ఉదయం కూతురికి ప్రామిస్ చేసిన విషయం మరిచిపోయాడు. "ఎక్కడికి రావాలి నేను?" అన్నాడు విసుగ్గా.

"అదేమిటి డాడీ సినిమాకి వెళదామని.." అనే అర్చన మాటి పూర్తి కాకుండా మధ్యలోనే కట్ చేస్తూ "ఏయ్ అర్చనా డోంట్ బీ చైల్డిష్. ఇక్కడ పేషెంట్స్ మధ్య నేను బిజీగా ఉన్న సమయంలో ఈ ఫోన్ కాల్సేమిటి. ముందు ఫోన్ పెట్టెయ్!" అన్నాడు భాస్కర్ కటువుగా.

తండ్రి మాటలు వినడంతోనే ఎక్కడలేని బాధా దుఃఖమూ ముంచుకొచ్చాయి అర్చనకు. సినిమాకి వెళ్లలేకపోయామనే బాధకంటే తండ్రి అన్న మాటలే ములుకుల్లా బాధించాయి. ఫోన్ పెట్టేసి తన గదిలోకి వెళ్లిపోయింది పరుగున.

రాత్రి బాగా పొద్దుపోయాక ఇంటికి వచ్చారు భాస్కర్, వందనాదేవి. కూతురు కనబడకపోవడంతో నిద్ర పోతుంది కాబోలు అనుకున్నారు ఇద్దరూ. భోజనం చేసి మేడ మీదకు వెళ్లిపోయారు.

ప్రతిరోజులాగే ఆరోజూ తెల్లవారింది. భాస్కర్, వందనాదేవి హాస్పిటల్‌కు వెళ్లేందుకు తయారయి బ్రేక్‌ఫాస్ట్‌కోసం డైనింగ్ టేబుల్‌వద్దకు వచ్చారు. అక్కడ అర్చన కనిపించకపోవడంతో...

"సావిత్రమ్మగారూ అర్చన ఇంకా లేవలేదా?" అనడిగింది వందనాదేవి.

"ఏమోనమ్మా, ఇంకా లేచినట్లు లేదు. రాత్రి కూడా సరిగ్గా అన్నం తినలేదు. చూసి రమ్మంటారా అమ్మా?" అంది సావిత్రమ్మ.

"వద్దులే. నేనే వెళ్తాను!" అంటూ వందనాదేవి లేచి కూతురి గదివైపు నడిచింది. ఆమె వెళ్లేసరికి అర్చన మంచం ఖాళీగా కనిపించింది. బాత్‌రూమ్‌కి వెళ్లిందేమోనని వెనుదిరిగిన వందన దృష్టి గాలికి రెపరెపలా

## బొద్దుగా వుంటేనే ముద్దు!

చాలావరకు హీరోయిన్లు డైటింగ్‌లూ గట్రా చేసేసి స్లిమ్‌గా తయారవుదామనే అనుకుంటారు కదా! శ్రియ మాత్రం కాస్త బరువు పెరిగితే తన కెరీర్‌కి ఉపయోగం అని భావించడం వల్ల లావవాలని అనుకుంటోందిట. 'శివాజి' అంత హిట్టయినా కూడా శ్రియ బక్కగా వుండడం వల్ల ఆమెకి జోరు జోరుగా ఆఫర్ల వెల్లువ వచ్చిపడకపోవడానికి కారణం తను బక్కగా వుండడమేననే కామెంట్లు ఆమె విందిట. హిందీలో కూడా ఆమెకి అంతగా అవకాశాలు రావడం లేదు కాబట్టి కాస్త లావై తమిళ రంగంలో బిజీ కావడమే బెటరనుకుంటోంది కాబోలు.

డుతూ టేబుల్ మీదున్న పేపరు మీదపడింది. అది ఎగిరి పోకుండా దానిమీద కేసెట్ పెట్టి ఉంది. ఆ పేపరు మీద అర్చన హేండ్ రైటింగ్ కనిపించడంతో కేసెట్ పక్కన పెట్టి ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుంది.

మమ్మీ, డాడీ...

నాతో మాట్లాడే తీరికా, ఓపికా మీకు లేవని తెలుసు. అందుకే నా మనసులోని బాధంతా ఈ కేసెట్‌లో రికార్డు చేసి పెట్టాను. మీకు తీరిక ఉన్నపుడు పెట్టుకొని వినండి. నాకోసం ఆదుర్దా పడకండి. నేను పిన్నిగారింటికి వెళ్తున్నాను.. ఇప్పటికింతే!

అర్చన

అది చదివిన వందనాదేవి ముఖం రక్తం లేనట్లుగా తెల్లగా పాలిపోయింది. ప్రాణం లేని బొమ్మలా నడిచి వచ్చి ఆ కాగితం భాస్కర్ చేతిలో పెట్టింది.

అది చదివిన భాస్కర్ "బాగుంది. ఈ సెంటిమెంటల్ ఫూల్‌కి ఆ సెంటిమెంటల్ ఫూల్ జతన్నమాట మంచిదాన్నే ఎన్నుకుంది. ఇక జీవితంలో ఇది బాగుపడదు!" అంటూ ఆ పేపరు పక్కన పడేసి బ్రేక్‌ఫాస్ట్ చేయసాగాడు.

ఇంకా అలాగే అచేతనంగా నుంచుని ఉన్న భార్య వైపు చిరాగ్గా చూస్తూ "ఏమిటలా చూస్తున్నావు? టైమవుతోంది. తొందరగా టిఫిన్ తిను!" అన్నాడు.

తప్పదన్నట్లుగా కూర్చున్నదే గానీ కొంచెం కూడా టిఫిన్ తినలేకపోయింది వందన.

"భాస్కర్.. ఈ పూట నేను హాస్పిటల్‌కు రాలేను. నువ్వే ఎలాగో మేనేజ్ చెయ్యి. మరీ సీరియస్ కేసులేమైనా ఉంటే నా ఫ్రెండ్ విమలకు ఫోన్ చెయ్యి!" అంటూ చెయ్యి కడుక్కొని లేచిందక్కడి నుంచి.

"ఏయ్ వందనా ఏమైంది నీకు? అది క్షేమంగానే ఉంది కదా. ఎందుకంత వర్రీ నీకు?" అన్నాడు భాస్కర్ అనునయంగా.

"ఏంలేదు, నా మనసు ఈవేళేం బాగుండలేదు. మన ధోరణిలో మనం పడి దాని ఫీలింగ్స్ ఏమీ పట్టించుకోలేదా అనిపిస్తోంది నాకు" అంది వందనాదేవి జీరబోయిన గొంతుతో. చెంపల మీదకు చేరిన కన్నీటిని కర్చీఫుతో అద్దుకుంది.

"వందనా, ఏమిటిది చిన్నపిల్లలా. రిలాక్స్! అర్చన ఎక్కడికి వెళ్లిందని అంత బాధపడుతున్నావు మీ చెల్లెలింటికే కదా. రెండు రోజులు పోతే అదే తిరిగి వస్తుంది" అన్నాడు భాస్కర్ వాతావరణాన్ని తేలిక పరిచే ఉద్దేశ్యంతో.

భాస్కర్ ఎంత చెప్పినా ఆ పూటకి హాస్పిటల్‌కి వెళ్లలేకపోయింది వందనాదేవి. భాస్కర్ వెళ్లిపోయాక సరాసరి కూతురి గదిలోకి వెళ్లి అర్చన తమ కోసం ఉంచిన కేసెట్టు చేతిలోకి తీసుకుంది. అందులో ఉన్న మాటలు వినాలంటే ఏదో జంకు. అందులో ఏముందోననే భయం వదనని అచేతనురాలిగా చేసింది. ఆ కేసెట్ అలా పట్టుకొని ఆలోచిస్తూ అక్కడే కూర్చుండిపోయింది.

○○○

"హాయ్ పిన్నీ.. హౌ ఆర్ యూ?" అంటూ పిన్నిగారింట్లో అడుగుపెట్టింది అర్చన.

చేతిలో బేగ్‌తో చెప్పాపెట్టకుండా హఠాత్తుగా ఊడిపడిన అర్చనను చూసి ఆశ్చర్యపోయింది మాలతి. "ఏమిటే అర్చూ.. ఉరమని పిడుగులా ఇలా ఊడిపడ్డావు. అమ్మా నాన్న బాగున్నారా?" అంటూ చేయిపట్టి తన పక్కన కూర్చోబెట్టుకుంది అర్చనను.

"అయ్యాయా నీ ప్రశ్నలు. ఏం చెప్పకుండా రాకూడదా మీ ఇంటికి. అవునులే నేనేం నీ కన్న కూతుర్నా?" అలక నటిస్తూ చేయి విడిపించుకుంది అర్చన.

"చాల్లేవే బడాయి! ఇప్పటికెన్ని సార్లే నిన్ను పిలిచాను. మా ఇంటికి రమ్మని. దాదాపు మూడేళ్లయింది నువ్వు మా ఇంటికి వచ్చి. ఎంసెట్, ర్యాంకూ అంటూ మీ అమ్మా, నాన్నా, నువ్వూ ఒకటే పాట. ఇప్పుడేమో తిరిగి నా మీద నింద. సరేగానీ ఎలా రాసావే పరీక్ష?" అంది మాలతి.

"గ్యారంటీగా నాకు రేంకు రాదు పిన్నీ!" అంటూ కాళ్లూ చేతులూ రిలాక్స్‌డ్‌గా ముందుకు చాపింది.

"అదేమిటే అలా అనేశావు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు రేంకు రాదని?" అంది ఆశ్చర్యంగా అర్చన వంక చూస్తూ.


"అదంతే పిన్నీ. కావాలనే నేను ఆన్సర్ సరిగ్గా చేయలేదు పేపరు. అది సరేగానీ బాబాయి లేరా ఇంట్లో కనిపించడంలేదు" అంది అర్చన, ఇల్లంతా కలియజూస్తూ.

"బాబాయి సంగతి తరువాత పరీక్ష ఎందుకు సరిగా రాయలేదో చెప్పు ముందు" అంది మాలతి నిలదీస్తున్నట్లుగా.

"ఏంటి నువ్వు కూడా మమ్మీలా. ఎంతసేపూ మీకు పరీక్షలు, రేంకులేనా. ఇంకేమీ అక్కరలేదా? ఇలా అయితే ఇక్కడి నుండి కూడా నేను వెళ్ళిపోతాను" అంది అర్చన బెదిరిస్తున్నట్లుగా.

ఆ మాటలు వినడంతోనే మాలతి అర్చనకు మరింత దగ్గరగా జరుగుతూ "అయితే అర్చూ, ఇంట్లో చెప్పకుండా వచ్చేశావా. తప్పు కదూ! అమ్మా, నాన్నా ఎంత కంగారు పడతారు?" అంది కూతురి భుజం మీద చెయ్యి వేసి.

"ఏం కంగారు పడరు. వాళ్లకి నేను ఇంట్లో ఉన్నా లేకపోయినా ఒకటే! పదిమందిలో గొప్పగా చెప్పుకునేందుకు నాకు రేంకు వస్తే చాలు. నేను కాలేజి నుంచి ఇంటికి వచ్చి నాలుగు రోజులైంది. నాతో ఒక్క పూటంటే ఒక్క పూట కలిసి భోంచేయలేదు. ఎప్పుడు



## అపర భక్తురాలు రాణి

వయసు పైబడినకొద్దీ చాలామందిలో దైవభక్తి క్రమంగా పెరుగుతుంటుంది అనడానికి తాజా నిదర్శనం బాలీవుడ్ భామ రాణీ ముఖర్జీ. ఈమధ్య రాణీ ముఖర్జీ తరచూ షిర్డీ వెళ్లి సాయిబాబా దర్శనం చేసుకుంటోందిట. నెలలో కనీసం రెండు మూడుసార్లయినా షిర్డీ వెళ్లొస్తోందిట. అకస్మాత్తుగా రాణీలో ఇంత భక్తిప్రపత్తులు కనిపించడానికి కారణం ఆమె కూడా ముప్పయేళ్లు దాటిపోయిన టింగణాయేగా అంటున్నారు బాలీవుడ్ సినీజనాలు. అంతేలెండి.

చూసినా బిజీ బిజీ. అందరు తల్లిదండ్రులూ ఇలాగే ఉంటున్నారా? అంతెందుకు తమ్ముడు ఉదయ్‌ని నువ్వూ, బాబాయి ఎలా చూస్తారు. దగ్గర కూర్చోబెట్టుకుని కబుర్లు చెబుతారు. వాడు చదుతున్నాడో లేదో బాబాయి దగ్గరుండి గమనిస్తారు. వాడికి ఏ వేళకి ఏం కావాలో అన్నీ జాగ్రత్తగా అమరుస్తావు నువ్వు. ఇవన్నీ నాకు చేయనక్కర్లేదు. రోజుకి ఒక పది నిముషాలు నాతో స్పెండ్ చేస్తుందా అమ్మ? ఎందుకు పిన్నీ, ఈ చదువులూ, సంపాదనలూను. నాకు జీవితం అంటే విరక్తి వచ్చేసింది!" ఆ చివరి మాట వింటూ బిగ్గరగా ఏడ్చేసింది అర్చన.

ఏడుస్తున్న అర్చనను చాలాసేపు ఓదారుస్తూ ఉండిపోయింది మాలతి. ఏడుపు ఉధృతం తగ్గాక సముదాయిస్తున్నట్లుగా అంది "నీ బాధ నేను అర్థం చేసుకోగలనమ్మా. కానీ నువ్విలా చేయడం మాత్రం సరైంది కాదు. నువ్వు చదువుకునేది ఎవరికోసం నీ కోసమే కదా. వాళ్లేదో సాధిస్తున్నానని నీకు నువ్వు అన్యాయం చేసుకుంటావా?" అంది మాలతి.

"నీకు అలాగే ఉంటుంది పిన్నీ. అనుభవించే వాళ్లకే ఆ బాధ ఏమిటో తెలుస్తుంది. ఒక్కసారి నా ప్లేసులో ఉంటే తెలిసేది నీకు. ఆఖరికి మా ఇంట్లో పని చేసే డ్రైవరు కూడా తన పిల్లలు టెన్త్ పరీక్షలు రాస్తూ ఉంటే దగ్గర ఉండి తీసుకు వెళ్లి తీసుకువచ్చాడు ఎగ్జామినేషన్ హాలుకి. నా దగ్గరకు రాలేదు, సరే వాళ్ళు వచ్చాక భోజనం చేద్దామని ఊరునుండి వచ్చిన నేను వెయిట్ చేస్తే చైల్డిష్‌గా బిహేవ్ చేస్తున్నానని డాడీ తిట్టారు నన్ను. అంత చిన్న ఆశ కూడా తీరలేదు నాకు. నిన్నటికి నిన్న సినిమాకి వెళదామని తనే ప్రామిస్ చేసి తొందరగా రాలేదని నేను ఫోన్ చేస్తే ఎదురు నన్నే దారుణంగా తిట్టారు. రేపు నేను కూడా ఇలాంటి లైఫ్ గడపడానికేనా డాక్టర్ కావలసింది?" అంది ఆవేశంగా అర్చన.

అర్చన చెప్పింది విన్నాక... తిరిగి జవాబు చెప్పేందుకు మాటలు కరువయ్యాయి మాలతికి. అయితే తాను ఇలా వదిలేస్తే అర్చన మరింత డిప్రెషన్‌కు లోనవుతుందని గ్రహించింది.

"సరేలేరా జరిగిందేదో జరిగిపోయింది. నీకీ కోర్సు ఇష్టం లేకపోతే మరోటి చెయ్యి. అమ్మానాన్నలకు నేను చెప్తాను. జరిగిందంతా మనసులో పెట్టుకొని బాధపడకు. అయినా ఇలా చెప్పాపెట్టకుండా రావడం చాలా తప్పు అర్చనా. ఎంత సేపూ నీ బాధ గురించే నువ్వు ఆలోచించావు కానీ అమ్మానాన్నల గురించి కొంచెం అయినా ఆలోచించావా? వాళ్ల వే ఆఫ్ థింకింగ్ వేరు కావచ్చు, కానీ ఉదయం లేచిందగ్గర నుంచి పడుకునే వరకూ వాళ్లు కష్టపడేది ఎవరికోసం. మీకోసమే కదా. అది మరిచిపోతే ఎలా?" అంది మాలతి.

"వద్దు పిన్నీ నాకీ హితబోధలేం చెయ్యవద్దు. విని వినీ విసుగు పుట్టేసింది!"

"సరేలే, మంచి వేడి మీద ఉన్నావు కానీ ఫ్రెషప్ అయిరా టిఫిన్ పెడతాను. ఈ లోగా నేను అమ్మానాన్నలకి ఫోన్ చేస్తాను" అంది మాలతి.



ఇంతలో ఫోన్ రింగయింది. మాలతి ఎత్తి "హలో!" అంది.

"హలో మాలతీ అర్చన వచ్చిందా అక్కడికి?"" అంది వందన ఆదుర్దాగా.

"వచ్చిందక్కా. బాత్‌రూమ్‌లో ఉంది, పిలవనా?" అంది మాలతి.

"వద్దులే మాలతీ. దానికి మా మీద బాగా కోపం వచ్చి ఇంట్లో చెప్పకుండా నీ దగ్గరకు వచ్చేసింది" అంది వందనాదేవి ఏడుపు గొంతుతో.

"బాధపడకక్కా. అది వచ్చిందెక్కడికి నా దగ్గరకేగా. ఓ పదిరోజులు నా దగ్గర ఉంచుకొని పంపిస్తానులే. ఈలోగా దాని మంచీ చెడ్డా అన్నీ కనుక్కుంటాను. విషయాలన్నీ తరువాత మాట్లాడుకుందాం!" అంటూ ఫోన్ పెట్టేసింది మాలతి.

కూతురు చెల్లెలి దగ్గరకి క్షేమంగా చేరుకుందని వినడంతో కొంచెం రిలీఫ్‌గా ఫీలయింది వందనాదేవి. అప్పుడు కూతురు ఇచ్చిన కేసెట్‌ని టేప్ రికార్డరులో పెట్టి ఆన్ చేసింది.

"మమ్మీ డాడీ! నేను చేసిన పని మీ దృష్టిలో చాలా ఫూలిష్‌గా కనిపిస్తుందని నాకు తెలుసు. అయినా ఇలా చేయకుండా ఉండలేకపోతున్నాను. అందరి పిల్లల్లాగే నాకూ మీతో సరదాగా గడపాలని ఎంతో ఆశ. కానీ మీకెప్పుడూ పట్టుమని పది నిముషాలు మాతో గడిపే తీరికే లేనంత బిజీ! ఎప్పుడూ పనీ పనీ.. దాని ద్వారా వచ్చే సంపాదన! నిముషాలను రూపాయలుగా మార్చే పని. ఎందుకోసం డాడీ ఈ పనీ? ఎవరికోసం మమ్మీ ఈ సంపాదన? మీరు సంపాదించిన డబ్బుతో అన్నీ కొనగలరు గానీ అమ్మా, నాన్నల ప్రేమనీ అనురాగాన్నీ నాకు కొనియ్యగలరా?

చిన్నప్పుడు అమ్మ మెడ చుట్టూ చెయ్యి వేసి గువ్వపిట్టలా అమ్మ గుండెల్లో తలదాచుకొని నిద్రపోయేదాన్ని! అలా పడుకోవడమంటే నాకెంతో ఇష్టం! అలాంటి నన్ను ఇంటిదగ్గర ఉంటే అన్నయ్య, నేను మిమ్మల్ని అక్కడికీ, ఇక్కడికీ తీసుకువెళ్లమని వేధిస్తున్నామనీ సెంటిమెంటల్‌గా ఎటాచిమెంటును పెంచుకుంటున్నామనీ మమ్మల్ని ఇద్దర్నీ రెసిడెన్షియల్ స్కూల్లో పడేశారు అతి చిన్నతనంలోనే!

## గడసరి హంసిక

'ఆప్ కా సురూర్' సినిమాలో హిమేష్ రేషమియాతో నటించిన కుర్రతార హంసిక (తెలుగు 'దేశముదురు' ఫేమ్) అదే సినిమాలో నటించిన మల్లికా షెరావత్‌ని షూటింగ్ సమయంలో 'ఆంటీ' అని పిలిచిందని, ఆ పిలుపు మల్లికకు కోపం తెప్పించిందనీ బాలీవుడ్‌లో జోరుగా చెప్పుకోవడంపై హంసిక స్పందించింది. 'అఫ్‌కోర్స్, ఇప్పుడు నా వయసు పదహారేళ్లే! అంతమాత్రాన మల్లిక లాంటి గ్లామరస్ స్టార్‌ని ఎంత సీనియర్ అయినా అలా 'ఆంటీ' అని నేనెందుకు పిలుస్తాను' అంటూ తెలివిగా చెబుతోంది. తను కాస్త బొద్దుగా వున్నానని, కొంత బరువు తగ్గేందుకు ట్రయ్ చేస్తున్నానీ అంటోంది హంసిక.

ఏమన్నా అంటే మేం ఏం చేసినా మీ భవిష్యత్తు కోసమే కదా చేస్తున్నాం, మీ కోసమే కదా కష్టపడుతున్నాం అని అంటారు. నిజమే! మా కోసమే కష్టపడి సంపాదిస్తున్నారు. మీరు సంపాదించినది అంతా మాకోసమే! దాంతో మేం పోగొట్టుకున్న బాల్యాన్ని తిరిగి కొనివ్వగలరా? ఇవ్వలేరు!

మేం మీలా గొప్పవాళ్ళం కావాలంటే రెసిడెన్షియల్ స్కూళ్లలో చదవక తప్పదన్నారు? మరి ఇంత గొప్పవాళ్లయిన మీరు ఏ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో కాలేజీల్లో చదివారు? ఏం? మీలా మేము ఇంట్లో, మీ సమక్షంలో చదవలేమనా మీ ఉద్దేశ్యం? పోనీ మేము శెలవులకు ఇంటికి వచ్చిన నాలుగు రోజులైనా మాతో ఎంజాయ్ చేసిన గుర్తు మీకేమైనా ఉందా?


అన్నయ్య ఉన్నన్నాళ్లూ మీరు మమ్మల్ని పట్టించుకోకపోయినా ఒకరికొకరం తోడుగా ఉన్నట్లు అనిపించేది. అన్నయ్య వెళ్లాక నేను పూర్తిగా ఒంటరిదాన్నయిపోయాను.

మీ లోకం మీద నా లోకం నాది అయిపోయింది. అన్నయ్యని డాక్టరు చేయాలనుకున్నా అన్నయ్య వినలేదు. నన్ను బలవంతాన బైపీసీ తీసుకునేలా చేశారు. నేను మీ మాట మీద గౌరవంతో చేశాను. కానీ మీ వైఖరి చూశాక నాకు వైద్య వృత్తి అంటేనే విరక్తి కలిగింది. దానికి కారణం మీరే!

అందరూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది అని చెప్తారు. కాని మిమ్మల్ని చూస్తే అలా అనిపించలేదు, నాకెప్పుడూ! ప్రతి నిమిషాన్నీ రూపాయలతో లెక్క కట్టే మీరు అందులో పవిత్రతను ఎలా చూపగలరు?

ప్రతీ మనిషీ గొప్పవాడు కావాలి. ఒప్పుకుంటాను. సాధించిన దానితో తృప్తి పడకుండా ఇంకా, ఇంకా ఉన్నత శిఖరాలను అందుకోవాలనుకోవడమూ తప్పు కాదు. అయితే ఆ ఉన్నత శిఖరాలు డబ్బు సంపాదనలోనే ఉందంటే నేను అంగీకరించను.

నిజంగా వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తే మిమ్మల్ని నేనిలా ప్రశ్నించి ఉండేదాన్ని కాదేమో! మీకున్న స్కిల్‌ని రూపాయల సంపాదనకే వినియోగించారు. కార్లలో వచ్చే ఖరీదైన మనుషులకు మీ వైద్యం పరిమితం చేశారు తప్ప ఏ నిరుపేద ప్రాణినైనా బ్రతికించడానికి వినియోగించారా? అంతెందుకు మనింట్లో పనిచేసే రత్తాలు బిడ్డను కనలేక చనిపోయింది. మీరు తలచుకుంటే మీలో మానవత్వం అనేది ఉంటే రత్తాలు ప్రాణాలు కాపాడి ఉండేవాళ్లు. రత్తాలు చనిపోయాక అయినా మీలో ఎలాంటి స్పందనా కలగలేదు. ఆరోజే మొదటిసారి అనుకున్నాను. ఎట్టి పరిస్థితిలోనూ నేను డాక్టరు కాకూడదని, డాక్టరయ్యాక మీలా మారిపోతానన్న ఊహనే నేను భరించలేకపోతున్నాను.




కానీ అలా కాకుండా బాగా చదివి డాక్టరునై ప్రజాసేవ చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఎమ్‌సెట్ కోచింగ్‌కు వెళ్ళాను. అక్కడ కూడా ఇదే కమర్షియల్ థింకింగ్‌తో అందరూ ఉండడం చూసి నా మనసు ఎటూ తేల్చుకోలేక డోలాయమానంగా అయిపోయింది. ఆరోజు మా ఎం.సెట్ పరీక్ష రోజు మీ ఇద్దరిలో ఏ ఒక్కరు వచ్చి నన్ను పరీక్షకు తీసుకువెళ్లినా నా మనసంత బాధకు గురయ్యేది కాదు. ఏదో ఫార్మాలిటీకోసం డ్రైవర్‌ని పంపించారు. ఇవన్నీ నా మనసు మీద చాలా ప్రభావం చూపించాయి. అందుకే కావాలనే నేను ఎం.సెట్ పేపరు సరిగ్గా ఆన్సర్ చేయలేదు. నాకు రేంకు రాకపోయినా ఎన్నారై కోటాలోనైనా సీటు కొని మెడిసిన్ చదివిద్దామని మీరు అనుకోవడం నేను విన్నాను. అందుకే ఇంట్లో నుండి వెళ్లిపోతున్నాను.

నాకీ యాంత్రికమైన జీవితం వద్దు! నిండుగా ప్రేమాభిమానాలు పంచి ఇచ్చే అమ్మా, నాన్నలు కావాలి. మీ ఆత్మీయత కావాలి. అది ఇక్కడ దొరదని అర్థమయింది. కనుక వెళ్లిపోతున్నాను. మీరనుకోవచ్చు చిన్న నోటి నుండి పెద్ద మాటలు వస్తున్నాయి అని. దానికేం తక్కువ? అన్ని దర్జాలూ, సుఖాలూ ఉన్నా ఇంకా ఏదో తక్కువయిందని ఇలా చేసింది అనుకుంటారు మీరు. కానీ ఇక్కడ నాకు చిన్నప్పుడు చదువుకున్న భర్తృహరి పద్యం గుర్తుకు వస్తోంది. దాని భావం.. ఎంత చదువుకున్నా వివేకం లేని చదువు వ్యర్థమనీ, అతి చక్కగా వంట చేసినా అందులో ఉప్పు లేకపోతే దానికి రుచే ఉండదనీ.. అర్థం.

అలా అన్నీ ఉన్నా వెలకట్టలేని ప్రేమానురాగాల ముందు అవన్నీ దిగదుడుపు అని నేను అనుకుంటున్నాను. ఆ ఇంటికి మళ్లీ తిరిగి వచ్చే ఉద్దేశ్యం నాకు లేదు. పిన్ని దగ్గరే ఉండి చదువుకుంటాను. మిమ్మల్ని ఇలా విసిగించినందుకు మీ వాల్యూబుల్ టైమ్‌ని కొంత వేస్ట్ చేసినందుకు నన్ను మన్నించండి.

శెలవు!

టేపు ఆగిపోయింది.. అందులో నుండి వినవచ్చిన అర్చన ఒక్కొక్క మాటా ఒక్కో తూటాలా వందన గుండెలో దూసుకుపోగా అచేతనంగా కూర్చుండిపోయింది.

ఇన్నాళ్లుగా తమ జీవితాల్లో తెలియకుంటానే తాము కోల్పోయిందంతా కళ్లెదుట నిల్చుని పరిహసిస్తున్నట్లుంది. తాము కోల్పోయిందేమిటో అర్థమయ్యాక ఇన్ని సంవత్సరాలుగా సంపాదించిన సిరిసంపదలు సంఘంలో హోదా, గౌరవాలూ అన్నీ అతి తేలికగా కాలదన్ని వెళ్లిపోయిన అర్చన ముందు అవన్నీ వెల వెలబోయినట్లయ్యాయి. వందన కళ్లు ఆర్తితో తడిశాయి అర్చనకోసం.

భార్యను కసిరి హాస్పిటల్‌కి వచ్చేశాడే కానీ అర్చన ఆలోచనల నుండి తప్పించుకోలేకపోయాడు భాస్కర్. ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ అని అర్చనను ఎత్తుకుని గిరగిరా తిప్పినప్పుడు కూతురి ముఖంలో కనిపించిన మెరుపులు తాను ఎన్ని ఖరీదైన బహుమతులు కొని ఇచ్చినా ఏనాడూ అర్చన ముఖంలో చూడలేకపోయాడు. అర్చన ఇష్టపడేది అన్నిటికంటే తమ సాన్నిహిత్యమే అని తెలిసి కూడా ఎంత నిర్లక్ష్యం చేశాడు. నిన్నటికి నిన్న పని వత్తిడిలో పడి ఇచ్చిన ప్రామిస్‌ని నిలబెట్టుకోకపోగా గుర్తు చేసిన అర్చనని చాలా హర్ట్ చేశాడు.

అందరికంటే తనూ తన బిడ్డలూ గొప్పగా ఎంతో గొప్పగా అయిపోవాలని ఆరాటపడ్డాడే కానీ పిల్లల మనసుల్లో రేగే పెనుతుఫానులనూ, ఆశలనూ గమనించలేకపోయాడు. బంగళాలూ, విలువైన కార్లూ బహుమతులుగా కొనిచ్చిన తను తనతో గడపాలని ఆరాటపడే అర్చన చిన్న కోరికను తీర్చలేకపోయాడు.

ఆలోచించిన కొద్దీ తాము చేసిన తప్పేమిటో అర్థమైన భాస్కర్ చివాలున ఛైర్‌లోంచి లేచి అసిస్టెంట్‌ని పిలిచి హాస్పటల్ బాధ్యతను అప్పగించి ఇంటికి బయలుదేరాడు. కారు డ్రైవ్ చేస్తున్నాడే కానీ కారుకంటే వేగంగా కూతుర్ని చూడాలనే భావన అతన్ని నిలవనీయలేదు.

టేపు విన్నాక కళ్లు మూసుకొని అర్చననే తలచుకుంటూ కన్నీరు కారుస్తున్న వందనాదేవి చెంపల మీద భాస్కర్ చేతి స్పర్శ తగలడంతో కళ్లు తెరిచి చూసింది. భర్తని చూడడంతోనే "చూశావా భాస్కర్! అర్చన ఏమందో?" అంటూ కేసెట్ తీసి భాస్కర్ చేతికి ఇచ్చింది.

"వద్దు వందనా! అదేం అంటుందో ఏమి కోరుకుంటుందో నాకు తెలుసు! వెళ్దాం పద, అర్చన దగ్గరకు!" అన్నాడు భాస్కర్ చేయందించి వందనను లేవదీస్తూ.

కారు తారు రోడ్డు మీద మెత్తగా సాగిపోతోంది. ఎక్కడి నుండో గాలిలో తేలివస్తున్న పాట.. 'ఏ సిరులెందుకూ.. ఏ సౌఖ్యములెందుకూ.. ఆత్మ శాంతిలేనిచో.. మనిషి బ్రతుకు నరకమౌను..' పాట వింటూ భాస్కర్ భుజం మీద తలవాల్చింది వందన.